ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
జయశంకర్ భూపాలపల్లి
ములుగు
ఆదివారం 14 జనవరి 2024



- మొదలైన కోడి పందాలు, పేకాట శిబిరాలు
- కత్తి కట్టేందుకు ఎంట్రీ ఫీజు.. రంగంలోకి దళారులు
- రహస్య ప్రదేశాల్లో అడ్డాలు.. అనుమానం రాకుండా జాగ్రత్తలు
- పోటాపోటీగా వేలల్లో బెట్టింగులు
- ప్రతీ యేట నామమాత్రంగా పోలీసుల చర్యలు.?

పల్లెల్లో సంక్రాంతి సందడి



కృష్ణకాలనీ(భూపాలపల్లి), జనవరి 13: పల్లెల్లో సంక్రాంతి పండుగ సందడి షురువు అయింది. ఈ పండక్కి ప్రతీ యేట సాగే పందాలు మొదలయ్యాయి. ఓ వైపు కోడి పందాలు.. మరోవైపు పేకాట శిబిరాలు వెలిశాయి. గతంలో ఎన్నడూలేని విధంగా కోడి పందాల్లో పాల్గొని కత్తి కట్టేందుకు ఎంట్రీ ఫీజు సైతం ఏర్పాటు చేయడం హాట్ టాపిక్‌గా మారింది. మండలంలో పేరున్న వక్తులు దళారుల అవతార మెత్తారు. అన్నీ తాము చూసుకుంటామంటూ భరోసా ఇస్తూ అక్రమ దందాకు తెరలేపినట్లు బహిరంగంగా చర్చ సాగుతోంది.

పేకాట, కోడి పందాలాట..

సంక్రాంతి వచ్చిందంటే పట్టణాల్లో నివాసముండే వారంతా పల్లెలకు చేరుకుంటారు. సరదా, టైంపాస్ కోసం ఆరాట పడుతుంటారు. ఈ నేపథ్యంలో ప్రతీ యేట మాదిరిగానే పేకాట, కోడి పందాలాట కొనసా గుతోంది. వీటి నిర్వహణ కోసం ఇప్పటికే జిల్లాలోని ఆయా గ్రామాల శివారు ప్రాంతాలు, రహస్య ప్రదేశాలను పందెం రాయుళ్లు ఎంచుకొని సిద్ధం చేసుకున్నారు. పందెంలో పాల్గొనే వారు వేరే వ్యక్తులకు ఆ సమాచారాన్ని ఇవ్వకుండా రహస్యంగా పరుగులు తీస్తున్నట్లు తెలిసింది. గతంలో ఆడే ప్రదేశాలతో పాటు కొత్తగా మరికొన్ని ప్రదేశాలను ఎంపిక చేసుకొని మకాం మార్చి పందాలను నిర్వహిస్తున్నట్లు సమాచారం.

బెట్టింగుల పర్వం..

కోడి పందాల్లో పాల్గొని కత్తి కట్టేందుకు గతంలో ఎన్నడూలేని విధంగా ఈసారి కొత్త తరహా పందాలకు కొంత మంది తెర తీసినట్లు ప్రచారం జరుగుతోంది. ఎంట్రీ ఫీజు రూ.200 నుంచి పోటీ అధికంగా ఉండే చోట రూ.500 ఫీజు ఫిక్స్ చేసినట్లు తెలిసింది. ప్రధానంగా కాటారం సబ్‌డివిజన్ పరిధిలోని మారుమూల పల్లెల్లో ఈ తతంగం సాగుతున్నట్లు సమాచారం. దళారులుగా రంగంలోకి దిగిన వ్యక్తులు పోలీసులతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామనే హామీతో డబ్బులు దండుకుంటున్నట్లు సమాచారం. అలాగే, పోటీల్లో ఉన్న వారు రూ.1000తో మొదలు పెట్టి రూ.20వేల వరకు కూడా బెట్టింగ్ పెట్టేందుకు వెనుకాడటం లేనట్లుగా తెలిసింది. మరోవైపు కోడిపందాల సమీప దూరంలోనే పేకాట శిబిరాలను ఏర్పాటు చేసి.. లోన బయట పోటీ జోరుగా సాగిస్తున్నట్లు సమాచారం. పేకాట సైతం రూ.10వేలకు పైనే సాగుతున్నట్లు జోరుగా చర్చ సాగుతోంది. ఏదైనా ఓ గ్రామంలో పోటీల నిర్వహణ ఉందంటే ఆయా చుట్టుపక్కల గ్రామాల పందెంరాయుళ్లు పోటీ పడి పందెంలో పాల్గొంటున్నట్లు తెలిసింది. ఇతర సుదూర ప్రాంతాల నుంచి పందెం కోళ్లను రూ.2వేల నుంచి రూ.5వేల వరకు పెట్టి కొనుగోలు చేసి పోటీలోకి దింపుతున్నారు.

ఈ ప్రాంతాల్లోనే అధికం..

జయశంకర్ భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా వివిధ మండలాల్లోని ఆయా గ్రామాల్లో కోడి పందాల ఆట, పేకాట ఆరంభమైంది. అయితే, గతంలో పోలీసుల నామమాత్రపు తనిఖీల్లో ఈ గ్రామాల్లోనే అధికంగా ఆటలు సాగిన ఘటనలున్నాయి. ఈసారి సైతం ఇదే గ్రామాల్లో పోటీలు ఉంటాయనే చర్చ బాహాటంగానే సాగుతోంది. కాటారం మండలంలోని దామెరకుంట, గుండ్రాత్‌పల్లి అటవీ ప్రాంతంలో, మహాముత్తారం మండలంలోని సింగారం, కనుకునూరు, యత్నారం, పెగడపల్లి, బోర్లగూడెం, మహదేవపూర్ మండలంలోని మద్దులపల్లి, పల్గుల, పలిమెల మండలంలోని సింగంపల్లి, ముకునూరు, మల్హర్ మండలంలో ఇప్పలపల్లి, కొండంపేట, తాడిచర్ల శివారు గ్రామాలు ఉన్నాయి. అలాగే, భూపాలపల్లి మండలంలోని పందిపంపుల, దూదేకులపల్లి, దీక్షకుంట గుట్టల్లో, చిట్యాల మండలంలోని అందుకుతండా గ్రామాల్లో సాయంత్రం ఓ వైపు కోడి పందాలు, మరోవైపు పేకాటకు ఢోకా లేకుండా పోతున్నట్లు తెలిసింది.



నామమాత్రపు చర్యలు..?

జిల్లాలో ప్రతీ యేట సంక్రాంతి పండుగకు భారీ ఎత్తున కోడి పందాలు, పేకాట నిర్వహణ సాగుతోంది. అయితే, వాటి నియంత్రణలో మాత్రం పోలీసులు అంతగా దృష్టి సారించడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. సీజన్‌లో అడపా దడపా దాడులు చేస్తూ నామమాత్రపు కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటారనే విమర్శలు ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో పేరున్న వ్యక్తులతో పాటు చోటా మోటా రాజకీయ నాయకులు సైతం కోడి పందాల నిర్వహణలో పాల్గొంటున్నట్లు సమాచారం. జిల్లాలో ప్రధానంగా కాటారం సబ్ డివిజన్ పరిధిలోని పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పలువురు వాపోతున్నారు. ఈ ప్రాంత పరిధిలోనే ఆట జోరుగా సాగుతుందనేది బహిరంగ రహస్యమే.



తెలంగాణలో సంక్షేమాభివృద్ధికి కృషి

- ప్రజా పరిపాలన కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- కాటారంలో కాంగ్రెస్ శ్రేణుల భారీ విజయోత్సవ ర్యాలీ



ర్యాలీలో మాట్లాడుతున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

కాటారం, జనవరి 13 : తెలంగాణలో ప్రణాళికాబద్ధంగా ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేస్తానని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. బీఆర్ఎస్ పార్టీలాగా నియంతృత్వ పాలన కాకుండా ప్రజా పరిపాలనే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఉద్ఘాటించారు. మంథని నియోజకవర్గం నుంచి ఐదోసారి ఎమ్మెల్యేగా గెలిచి రాష్ట్ర మంత్రి వర్గంలో చోటు దక్కించుకున్న అనంతరం మండలంలో శనివారం రాత్రి పర్యటించి కాంగ్రెస్ శ్రేణులు నిర్వహించిన భారీ విజయోత్సవ ర్యాలీలో శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. గంగారం క్రాస్ రోడ్డు నుంచి మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వరకు బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పలు గ్రామాల వద్ద మహిళలు మంగళహారతులతో ఘనంగా స్వాగతం పలకగా, కాంగ్రెస్ నాయకులు గజమాలలు, శాలువాలు, బొకేలతో సన్మానించి తమ అభిమానం చాటుకున్నారు.

ఈ సందర్భంగా కాటారంలో వందలాదిగా హాజరైన ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులనుద్దేశించి శ్రీధర్‌బాబు మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు ఎన్ని కుట్రలు పన్నినా, కల్లబొల్లి హామీలిచ్చినా, రౌడీయిజం, గుండాయిజానికి పాల్పడినా ప్రజలు చెంపపెట్టులాగా తీర్పిచ్చి తనను భారీ మెజారిటీతో గెలిపించడమే కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చారని అన్నారు. వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. కాంగ్రెస్ పార్టీ అభయహస్తంలో భాగంగా ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలతో పాటు ఇతర హామీలను తప్పకుండా నెరవేరుస్తామన్నారు. మంథని నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. చిన్న కాళేశ్వరం ప్రాజెక్టును 365 రోజుల్లోగా పూర్తి చేయించి 4 మండలాల రైతులకు సాగునీరందిస్తామన్నారు. కాటారం నుంచి పెద్దపల్లి వరకు గల 60 కిలోమీటర్ల రోడ్డును త్వరలోనే నేషనల్ హైవేగా ఏర్పాటు చేయిస్తానని, ఇప్పటికే కేంద్ర మంత్రితో మాట్లాడటం జరిగిందన్నారు. పరిశ్రమలను ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు యువతలో నైపుణ్యాలు పెంపొందించడానికి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ప్రకాష్‌రెడ్డి, ఎంపీపీలు పంతకాని సమ్మయ్య, మలహల్‌రావు, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, సుగుణ, మహేశ్వరి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం..

మల్హర్ : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. శనివారం మండలంలోని కొయ్యూర్ నుంచి ప్రారంభించిన విజయోత్సవ ర్యాలీలో మాట్లాడుతూ.. గెలిచిన కొద్ది రోజుల్లోనే రెండు పథకాలైన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ రూ.10 లక్షలకు పెంపు అమలు చేశామన్నారు. తనను కలిసేందుకు హైదరాబాద్‌కు పని కట్టుకొని రావద్దని, కాటారం, మంథనిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల్లో సమస్యలను విన్నవించాలని కోరారు. తమ సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు మంతి శ్రీధర్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ముందుగా కొయ్యూర్ చౌరస్తాలోని శ్రీపాద విగ్రహానికి పూలమాల వేసి ర్యాలీని ప్రారంభించగా, కాంగ్రెస్ నాయకులు శ్రీధర్‌బాబును భారీ గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ చింతలపల్లి మల్హల్‌రావు, జడ్పీటీసీ అయిత కోమలరాజిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బడితల రాజయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భవనానికి రంగులు వేయడానికి వచ్చి..

బైక్‌పై వెళ్తుండగా అదుపుతప్పి చెట్టుకు ఢీ





వెల్తూరి పవన్, పోతుగంటి వంశీ (ఫైల్)

వివరాలు 6వ పేజీలో

- అక్కడికక్కడే ఇద్దరి మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు..
- తాడ్వాయి మండలంలో ఘటన
- మృతులది శాయంపేట మండలం పత్తిపాక
- పనికి తీసుకెళ్లిన వ్యక్తి బాధ్యత వహించాలని గ్రామంలో ధర్నా

బాలకార్మిక వ్యవస్థ సమాజ అభివృద్ధికి గొడ్డలిపెట్టు



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా అధికారి ఓంకార్

జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారి ఓంకార్

వివరాలు 8వ పేజీలో

సందడిగా మారిన మేడారం

వనదేవతలకు భక్తుల ముందస్తు మొక్కులు



వనదేవతల గద్దెలను దర్శించుకుంటున్న భక్తులు

మేడారం, జనవరి 13: తాడ్వాయి మండలంలోని మేడారం వనదేవతలు సమ్మక్క-సారలమ్మలను దర్శించుకోవడానికి భక్తులు శనివారం అధికంగా తరలివచ్చారు. వచ్చే ఫిబ్రవరి 21వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు ఆదివాసీ వనదేవతల మహా జాతర ఘనంగా జరగనుంది. ఈ నేపథ్యంలో వివిధ దూర ప్రాంతాలకు చెందిన భక్తులు కుటుంబ సమేతంగా మేడారం చేరుకొని తల్లుల గద్దెలకు ముందస్తు మొక్కులు చెల్లించుకుంటున్నారు. భక్తులు ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. కల్యాణ కట్టల్లో తలనీలాలు సమర్పించారు. అనంతరం సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలను దర్శించుకున్నారు. పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, చీరె, సారె, కొబ్బరికాయలు, బెల్లం(బంగారం) సమర్పించుకుని పూజలు చేశారు. చల్లగా చూడాలని మొక్కుకున్నారు. సుమారు 20వేలకు పైగా భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని మేడారం ఎగ్జిక్యూటివ్ అధికారి రాజేంద్రం తెలిపారు.



మేడారంలో రద్దీగా మారిన వనదేవతల ప్రాంగణం

రామప్పను సందర్శించిన సీసీఎఫ్



రామప్ప దేవాలయం ఆవరణలో అధికారులతో సీసీఎఫ్ శివాని దొంగ్ర

వెంకటాపూర్(రామప్ప), జనవరి 13: మండలంలోని పాలంపేట గ్రామంలో గల యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని శనివారం సీసీఎఫ్ శివాని దొంగ్ర కుటుంబ సమేతంగా సందర్శించారు. ఆలయ అధికారులు, అర్చకులు వారిని సాదరంగా ఆహ్వానించగా రామలింగేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె నందీశ్వరుడిని దర్శించుకోవడంతో పాటు ఆలయంలోని శిల్పకళా సౌందర్యాన్ని వీక్షించి అబ్బురపడ్డారు. ఆలయ చరిత్ర, విశిష్టత గురించి గైడ్‌లను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఎఫ్ఆర్వోలు శంకర్, కొండల్‌రెడ్డి, రవికుమార్, ఎఫ్‌బీవో వి.రజిత, అటవీశాఖ సిబ్బంది ఉన్నారు.

రహదారి పనులకు బ్రేక్

- ఎన్‌హెచ్-163 విస్తరణ పనులకు అటవీశాఖ మోకాలడ్డు
- జాకారం-మల్లంపల్లి మధ్య నిలిచిన 4 కిలోమీటర్ల రహదారి వెడల్పు
- ప్రమాదకరంగా కల్వర్టులు
- సమీపిస్తున్న మేడారం మహాజాతర
- స్పందన లేని అధికార యంత్రాంగం
- అభివృద్ధి పనులకు సహకరించని ఫారెస్టు శాఖ



జాకారం-మల్లంపల్లి మధ్య నిలిచిపోయిన 163 జాతీయ రహదారి పనులు

ములుగు, జనవరి 13 : రెవెన్యూ, అటవీ శాఖల నడుమ లోపించిన సమన్వయం ములుగు జిల్లా ప్రగతిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రధానంగా అభివృద్ధికి సూచికలైన రోడ్ల నిర్మాణాలలో తీవ్ర ఆటంకం కలుగుతోంది. ఒక దశలో పరిస్థితి రెండు శాఖల మధ్య ప్రచ్ఛన్న యుద్ధానికి దారితీస్తోంది. కేసుల వరకూ వెళ్లిన సందర్భాలున్నాయి. కీలకమైన హైదరాబాద్-భూపాలపట్నం 163 జాతీయ రహదారి విస్తరణ పనుల విషయంలో కూడా ఈ సమస్య తలెత్తింది. అటవీశాఖ అభ్యంతరం వ్యక్తం చేయడంతో పనులు నిలిచిపోయాయి. మేడారం మహాజాతరకు సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో వాహనదారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. అసంపూర్తి పనులు, తెరుచుకున్న కల్వర్టులు ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి.

హనుమకొండ జిల్లా కొత్తపేట క్రాస్‌రోడ్డు నుంచి ములుగు సమీపంలోని గట్టమ్మ దేవాలయం వరకు 163 జాతీయ రహదారి విస్తరణ కోసం 2001 ఏప్రిల్‌లో కేంద్ర ప్రభుత్వం రూ.317.19 కోట్లను కేటాయించింది. 43 కిలోమీటర్ల రోడ్డును నాలుగు లేన్లుగా విస్తరించే ఈ పనులు ప్రారంభమయ్యాయి. రెండు ప్యాకేజీలుగా (గట్టమ్మ-సీరుకుళ్ల, గూడెప్పాడ్-కొత్తపేట) విభజించగా పనులు జరుగుతున్నాయి. అయితే ములుగు మండలంలోని జాకారం-మల్లంపల్లి మధ్య రహదారి విస్తరణ పనులకు ఐదు నెలల క్రితం బ్రేకులు పడ్డాయి.



మల్లంపల్లి కెనాల్ సమీపంలో ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు


నిలిచిన నాలుగు కిలోమీటర్ల విస్తరణ

ములుగు మండలం గట్టమ్మ దేవాలయం నుంచి మల్లంపల్లి ఎస్సారెస్పీ కెనాల్ వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల జాతీయ రహదారి పనులు నిలిచిపోయాయి. గట్టమ్మ దేవాలయం-జాకారం మధ్య 300 మీటర్లు, జాకారం సమీపంలోని నాగిరెడ్డి కుంట-మల్లంపల్లి కెనాల్ మధ్య 3.5 కిలోమీటర్ల మేరకు పనులు ఆగాయి. ఈ విస్తరణ పనుల్లో తమ శాఖ పరిధిలోని భూములు కోల్పోతున్నామని, ముందస్తు అనుమతులు తీసుకోకుండా.. నష్టపరిహారం చెల్లించకుండా ఇష్టాను సారంగా పనులు చేస్తున్నారని ఫారెస్టు అధికారులు ఆరోపిస్తున్నారు. ములుగు జిల్లా కలెక్టర్‌గా ఎస్.కృష్ణఆదిత్య పనిచేస్తున్న సమయంలోనే ఈ వివాదం తలెత్తింది. 11.8 హెక్టార్ల అటవీ భూమిని నష్టపోతున్నామని, భూమికి బదులుగా మరోచోట భూమి, సామాజిక అడవుల పెంపకానికి రూ.8 కోట్లను ఇవ్వాలని అటవీ శాఖ ఉన్నతాధికారులు సూచించారు. రోడ్డు విస్తరణ జరిగే భూములు రెవెన్యూ శాఖకు సంబంధించినవేనని కలెక్టర్ వాదించారు. ఇందుకు సంబంధించిన పలు ఆధారాలను చూపించారు. అయినప్పటికీ ఫారెస్టు అధికారులు తగ్గకపోవడంతో తప్పనిసరి పరిస్థితిలో తహసీల్దార్ ద్వారా సీఆర్‌పీసీ-145 కింద నోటీసులు జారీ చేయించి పోలీసు పహారాలో పనులు జరిపించారు. జూలైలో ఆయన బదిలీ అయిన తర్వాత పనులు నిలిచిపోయాయి. ఈ క్రమంలో జాతీయ రహదారుల శాఖ ఈఈ, డీఈ, ఏఈతో పాటు కాంట్రాక్టర్‌పై ఫారెస్టు కన్జర్వేషన్ యాక్టు కింద అటవీశాఖ అధికారులు కేసులు నమోదు చేశారు.


డేంజర్ జోన్‌లుగా కల్వర్టులు

రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోయిన నాలుగు కిలోమీటర్ల మార్గంలో పదికి పైగా కల్వర్టులున్నాయి. ఇరుగ్గా ఉన్న పాత నిర్మాణాలను తొలగించే క్రమంలో రహదారికి ఇరువైపులా గోతులు తీశారు. ఇప్పుడు పనులు నిలిచిపోవడంతో అవి ప్రమాదాలకు నిలయంగా మారాయి. తాత్కాలికంగా కర్రలు, రిబ్బన్లతో సూచికలు ఏర్పాటు చేయగా రాత్రివేళ గుర్తుపట్టడం కష్టంగా ఉంది. మూల మలుపుల వద్ద ఎటువంటి సూచికలు లేవు. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. పైగా రోడ్డుకిరువైపులా కొన్నిచోట్ల కంకరపోసి వదిలేశారు. మరికొన్ని చోట్ల పోసిన మట్టి వర్షానికి కొట్టుకుపోయి గుంతలు పడ్డాయి. మేడారం మహాజాతరకు సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో భక్తులు

మిగతా 8వ పేజీలో...







ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ | డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి | ఏషియన్ సత్యం - అమీర్‌పేట్
సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట | సినీ ప్లానెట్ - కొంపల్లి
ఫోరం మాల్ - కూకట్‌పల్లి | ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్
ఆర్.కె. - బంజారాహిల్స్ | ఏషియన్ రాధిక - కాప్రా
ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్ | ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్
గలేరియా - పంజాగుట్ట | ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి
ఐకాన్ - హైటెక్‌సిటీ | మిరాజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్
పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్ | మిరాజ్ సినిమాస్ - బాలానగర్
పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్ | మిరాజ్ సినిమాస్ - చందానగర్
ప్రిస్టన్ మాల్ - గచ్చిబౌలి | లక్ష్మీనరసింహ - మియాపూర్
అట్రియమ్ - గచ్చిబౌలి | రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
ఎస్2 నోమ - మల్లాపూర్ | జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి
జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్ | మూవీటైమ్ - అమీర్‌పేట
ఎం.పి మాల్ - కాచిగూడ | ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి
జిఎస్ఎమ్ - మదీనగూడ | టివోలి - సికింద్రాబాద్
నెక్లెస్ సత్వ - కవాడిగూడ | విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్ | శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
మంజీరామాల్ - కూకట్‌పల్లి | షా షహెన్‌షా - చింతల్
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి | లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్
మంత్రామాల్ - అత్తాపూర్ | మూవీమ్యాక్స్ - మౌలాలి
సుధా - శాలిబండ | జె.పి.సినిమాస్ - చందానగర్



సంఘటనా స్థలిలో వంశీ, పవన్ మృతదేహాలు

భవనానికి రంగులు వేయడానికి వచ్చి..

- బైక్‌పై వెళ్తుండగా అదుపుతప్పి చెట్టుకు ఢీ
- అక్కడికక్కడే ఇద్దరి మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు



పత్తిపాకలో సుధాకర్ ఇంటి ఎదుట మృతదేహాలతో బంధువుల ఆందోళన

తాడ్వాయి/శాయంపేట, జనవరి 13: జనవరి 13: పీఏసీఎస్ నూతన భవనానికి రంగులు వేయడానికి వచ్చిన వారిలో ముగ్గురు యువకులు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఇందులో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని నాంపల్లి బంజర గ్రామ శివారులో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే...

హనుమకొండ జిల్లా శాయంపేట మండలం పత్తిపాక గ్రామానికి చెందిన పోతుగంటి వెంకటేశ్వర్లు-వనితల కుమారుడు వంశీ(23), ఎల్తూరి మొగిలి-జయలక్ష్మిల కుమారుడు పవన్(22), మామిడి కుమారస్వామి - అన్నపూర్ణల కుమారుడు భాస్కర్(30)లు తాడ్వాయి మండల కేంద్రంలోని పీఏసీఎస్ నూతన భవనానికి రంగులు వేయడానికి వచ్చి పనులు చేపడుతున్నారు. అక్కడ పని ముగిశాక కాటాపూర్‌లోని పీఏసీఎస్ గిడ్డంగి భవనానికి కూడా రంగులు వేసి శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనంపై తిరిగి తాడ్వాయికి వస్తున్నారు. ఈ క్రమంలో నాంపల్లి బంజర మూలమలుపు వద్దకు చేరుకోగానే వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొంది. దీంతో వంశీ, పవన్‌లు రోడ్డుకు పది మీటర్ల దూరంలో ఎగిరిపడి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. మామిడి భాస్కర్‌కు తీవ్రగాయాలు కావడంతో 108 వాహనంలో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. శనివారం ఉదయం కాటాపూర్ వెళ్లే వాహనదారులు వారిని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని మృతుల కుటుంబాలకు సమాచారం అందించి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ములుగు ఏరియా వైద్యశాలకు తరలించారు. కాగా, మృతుల తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు వివరించారు. కాగా, వీరందరూ అవివాహితులని తెలిపారు.

పత్తిపాకలో ఉద్రిక్తత

ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుల కుటుంబాలకు న్యాయం చేయాలని బంధువులు, మద్దతుదారులు మృతదేహాలతో ఆందోళనకు దిగారు. శాయంపేట మండలం పత్తిపాక గ్రామానికి చెందిన పోతుగంటి సుధాకర్.. వెల్తూరి పవన్(22), పోతుగంటి వంశీ(23), మామిడి భాస్కర్‌లను ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని పీఏసీఎస్ భవనాలకు రంగులు వేయించడానికి తీసుకెళ్లారని, దీనికి యువకుల మృతికి పోతుగంటి సుధాకర్ బాధ్యత వహించి మృతుల కుటుంబాలకు తగిన న్యాయం చేయాలని శనివారం మృతదేహాలను సుధాకర్ ఇంటి వద్ద వేసి ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో గ్రామంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మూడుగంటల ఉద్రిక్తతల నడుమ సీఐ మల్లేష్‌తోపాటు శాయంపేట, ఆత్మకూరు, దామెర, పరకాల ఎస్సైలు మృతుల బంధువులను సముదాయించారు. సుధాకర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుని బాధిత కుటుంబాలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో మృతదేహాలను తీసుకుని వెళ్లారు. అనంతరం మృతదేహాల వాహనాన్ని గ్రామంలోని ప్రధానరోడ్డుపై నిలిపి సుధాకర్‌ను తీసుకొచ్చేవరకు మృతదేహాలను తీసుకెళ్లేది లేదని రోడ్డుపై ఆందోళనకు దిగారు. దీంతో మళ్లీ పోలీసులు ప్రవేశించి కుటుంబ సభ్యులు, బంధువులు, మద్దతుదారులకు సర్ది చెప్పి మృతదేహాలను తరలించారు. మృతి చెందిన యువకులను పనికి తీసుకెళ్లిన సుధాకర్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.



భార్య ఆత్మహత్య..? భర్త హత్య..?

» అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

» ఆమె బంధువుల దాడి.. చనిపోయిన భర్త

» అచ్చంపేటలో దారుణం.. ఇరు కుటుంబాల్లో విషాదం



సింధు, నాగార్జున (ఫైల్)

అచ్చంపేట, జనవరి 13 : అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత చనిపోయింది. కుటుంబ కలహాలు, వరకట్నం, లైంగిక వేధింపుల ఆరోపణలు ఆమె మరణం చుట్టూ అలుముకున్నాయి. కట్టుకున్నోడి వల్లనే తమ బిడ్డ చనిపోయిందని ఆగ్రహించిన యువతి బంధువులు ఆమె భర్తపై దాడి చేశారు. దెబ్బల తీవ్రతనో.. మరే కారణమో తెలియదు కానీ.. అతడు చనిపోయాడు. దీంతో ఇరు కుటుంబాల్లో విషాదం నిండింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటకు చెందిన సింధు(26)కు పట్టణంలోని శ్రీరాం(సరిరాం) ఆస్పత్రిలో పని చేస్తున్న ఖమ్మం జిల్లాకు చెందిన నాగార్జునతో పరిచయం ఏర్పడి, ప్రేమగా మారింది. మూడేళ్ల క్రితం వీరు హైదరాబాద్‌లోని ఆర్య సమాజ్‌లో పెళ్లి చేసుకున్నారు. కొంత కాలం అక్కడే ఉండి తర్వాత అచ్చంపేటకు వచ్చి శ్రీరాం ఆస్పత్రిలో పని చేస్తున్నారు. ఏడాది క్రితం దంపతుల మధ్య గొడవలు జరగడంతో సింధు.. బిజినేపల్లిలోని అమ్మమ్మ గారి ఇంటికి వెళ్లిపోయింది. నాగార్జున పోలీసులను ఆశ్రయించడంతో ఆమె తిరిగి వచ్చింది. ఆర్థిక పరిస్థితులు బాగాలేకపోవడం, డబ్బు కోసం భర్త వేధింపుల నేపథ్యంలో ఇరువురి మధ్య మళ్లీ గొడవలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి సింధు ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. కొన ఊపిరితో ఉన్న ఆమెకు భర్త నాగార్జున.. శ్రీరాం ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించాడు. పరిస్థితి విషమంగా ఉండటంతో అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తరలిస్తుండగా సింధు చనిపోయింది. ఈ విషయాన్ని నాగార్జున.. సింధు కుటుంబ సభ్యులకు తెలిపాడు. దీంతో ఆమె బంధువులు ఒక వాహనంలో అంబులెన్స్ వద్దకు చేరుకున్నారు. నాగార్జునను తమ వాహనంలో ఎక్కించుకొని తీవ్రంగా దాడి చేశారు. దెబ్బల తీవ్రతనో.. మరే కారణమో తెలియదు గానీ.. నాగార్జున చనిపోయాడు. అతడిని కొట్టి చంపేశారని నాగార్జున తల్లి, చెల్లెలు ఆరోపిస్తున్నారు. కాగా, తమ కూతురిని చంపి, ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని సింధు తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. నాగార్జున, డాక్టర్ కృష్ణ, అతడి భార్య హైమావతి ఇదంతా చేశారని చెప్పారు. డాక్టర్ కృష్ణ తమ కూతురిని పలుమార్లు లైంగికంగా వేధించాడని తెలిపారు. నాగార్జున మృతిపై అతడి కుటుంబీకులు కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నీటి బకెట్‌లో పడి చిన్నారి మృతి

కొత్తూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఓ 16 నెలల చిన్నారి ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు నీటి బకెట్‌లో పడి మృతిచెందింది. ఈ విషాదకర ఘటన రంగారెడ్డి జిల్లా కొత్తూర్‌లో శనివారం జరిగింది. బిహార్‌కు చెందిన ధర్మేందర్ దంపతులు కొత్తూర్ నారాయణగూడ కాలనీలో నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తున్న ధర్మేందర్ శనివారం పనికి వెళ్లాడు. అతని భార్య ఇంటి పనుల్లో నిమగ్నమై ఉండగా పెద్ద కుమార్తె రుయా (16 నెలల) ఆడుకుంటూ వెళ్లి బాత్‌రూంలోని నీటి బకెట్‌లో పడిపోయింది. నీటి బకెట్‌లో చిన్నారి మృతి చెంది కనిపించడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

అప్పులు తీర్చలేక యువ రైతు ఆత్మహత్య

ఖానాపూర్, జనవరి 13 : పత్తి పంట దిగుబడి రాకపోవడం, అప్పులు పెరిగిపోవడంతో జీవితంపై విరక్తి చెందిన ఓ యువ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం చందునాయక్ తండాకు చెందిన గుగ్లావత్ శ్రీకాంత్ (26) రెండు ఎకరాల్లో పత్తి వేశాడు. ఈ సారి ఆశించినంత దిగుబడి రాలేదు. దీనికి తోడు తన అక్క పెళ్లి కోసం చేసిన రూ.3 లక్షల అప్పు ఎలా తీర్చాలో తెలియక నిత్యం మథన పడేవాడు. ఈ క్రమంలోనే శనివారం రాత్రి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

బస్సు మంటల్లో మసైపోయి..

గద్వాల జిల్లా బీచుపల్లి వద్ద ప్రైవేటు బస్సు బోల్తా.. చెలరేగిన మంటలు.. మహిళ సజీవ దహనం



మంటల్లో పూర్తిగా కాలిపోయిన బస్సు, ఇన్‌సెట్లో... మాలతి(ఫైల్)

గద్వాల, గద్వాల క్రైం /ఎర్రవల్లి, నార్సింగ్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): బోల్తాపడ్డ ఆ బస్సుకు అంటుకున్న మంటలు పెద్దవి కాకమునుపే ప్రయాణికుల్లో కొందరు ఎలాగో అలా బయటపడ్డారు. చాలామందిని స్థానికులే రక్షించారు. ఒక్క మహిళ మాత్రం ఆ బస్సులోనే ఉండిపోయింది. రాకాసి మంటలు కోరలు చాస్తూ బస్సు అంతటా వ్యాపించాయి. ఆ మంటల్లో ఆమె కాలిబూడిదై పోయింది. ఈ హృదయవిదారక ఘటన గద్వాల జిల్లాలో జరిగింది. హైదరాబాద్ నుంచి చిత్తూరు వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు శనివారం తెల్లవారుజామున బీచుపల్లి-ఎర్రవల్లి మధ్య బోల్తా పడింది. ఆ వెంటనే బస్సు ముందు భాగంలో మంటలంటుకున్నాయి. మృతురాలిని ఏపీలోని చిత్తూరు జిల్లాకు చెందిన మాలతి (45)గా గుర్తించారు. పోలీసుల వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి 11 గంటలకు ఓ ప్రైవేటు బస్సు హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి నుంచి చిత్తూరుకు బయలుదేరింది. బస్సులో 42 మంది ప్రయాణికులు, ఇద్దరు డ్రైవర్లు ఉన్నారు. హైదరాబాద్ నుంచి జడ్చర్ల దాబా దాకా ఒక డ్రైవర్ బస్సు నడిపాడు. తర్వాత ఒంటి గంట సమయంలో స్టీరింగ్ రెండో డ్రైవర్ తీసుకున్నాడు. బీచుపల్లి దాటిన తర్వాత, పదవ బెటాలియన్ సమీపంలో తెల్లవారుజామున 2.30 గంటలకు బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ప్రయాణికులు ప్రాణభయంతో కేకలు వేశారు. పక్కనే ఉన్న హార్వెస్టర్ గ్యారేజీ కార్మికులు, పెట్రోల్ బంక్ వర్కర్లు హుటాహుటిన స్పందించారు. బస్సు అద్దాలను పగులగొట్టి ప్రయాణికులను కాపాడారు. పోలీసులు కూడా సహాయక చర్యలు చేపట్టారు.ఆ వెంటనే బస్సులో మంటలు చెలరేగాయి. మంటల్లో మాలతి అనే ప్రయాణికురాలు చిక్కుకుపోయారు. ఆమె చెయ్యి బస్సు సీటు సందులో ఇరుక్కుపోవడంతో తప్పించుకునేందుకు వీల్లేకపోయినట్లు తెలుస్తోంది. కాపాడండి అంటూ ఆమె ఆర్తనాదాలు చేస్తున్నా, అప్పటికే మంటలు తీవ్రం కావడంతో ఎవరూ ఆమెను రక్షించే సాహసం చేయలేకపోయారు. అందరి కళ్ల ముందే ఆమె సజీవ దహనమయ్యారు. మాలతిది చిత్తూరు జిల్లా పెనుమూరు మండలం, పుత్తమర్ల గ్రామం. ఆమె హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని రైస్ రీసెర్చ్ సెంటర్‌లో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నారు. భర్త శ్రీనివాస్ కూడా హైదరాబాద్‌లోనే వ్యాపారం చేస్తుండటంతో ఆ కుటుంబం నగరంలోని లంగర్‌హౌజ్‌లో ఉంటోంది. భర్త శ్రీనివాస్ తల్లి అనారోగ్యానికి గురవ్వడంతో రెండ్రోజుల క్రితం ఆమె చిత్తూరుకు వెళ్లిపోయారు. మాలతి కూడా శుక్రవారం రాత్రి బస్సులో సొంతూరుకు ప్రయాణమయ్యారు. తెల్లవారుజామున మూడు గంటల సమయంలో ఘటన జరగ్గా, ఉదయం ఏడు గంటల దాకా మాలతి మృతదేహం కాలుతూనే ఉంది.. తన కళ్ల ముందే మాలతి మంటల్లో సజీవదహనమైందని గద్వాల వాస్తవ్యుడు కలీం అనే ప్రత్యక్ష సాక్షి చెప్పారు. హైదరాబాద్ నుంచి ఊరికి వెళుతుండగా బస్సుకు మంటలంటుకోవడాన్ని గమనించి అక్కడికి వెళ్లాలని ఆయన చెప్పారు. కాగా డ్రైవర్ నిద్రమత్తే బస్సు ప్రమాదానికి కారణం అని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. 36 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఆరుగురు ప్రయాణికులు, ఒక డ్రైవర్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఘటన స్థలంలోనే మాలతి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. గద్వాల, అలంపూర్ ఎమ్మెల్యేలు కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు ఘటనాస్థలికి వెళ్లారు.

గతంలోనూ ఇదే తరహా ఘటనలు

ఉమ్మడి పాలమూరు జిల్లా పరిధిలో గతంలోనూ ఇలాంటి ప్రమాదాలు జరిగాయి. 2002 సెప్టెంబరు 5న గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం కోదండాపురం వద్ద హైదరాబాద్ నుంచి కడప జిల్లా రాయచోటికి వెళ్తున్న ఆర్టీసీ బస్సులో మంటలు చెలరేగాయి. ఈ బస్సులో ప్రయాణిస్తున్న 31 మందిలో 13 మంది చనిపోయారు. మరో 18 మందికి తీవ్రగాయాలయ్యాయి. 2013 అక్టోబరు 30న బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న జబ్బార్ ట్రావెల్స్‌కు చెందిన వోల్వో బస్సు కొత్తకోట మండలం పాలెం వద్ద కల్వర్టుకు ఢీకొని రాసుకపోవడంతో మంటలు చేలరేగి బస్సుకు మంటలంటుకున్నాయి.. ఈ ఘోర దుర్ఘటనలో 45 మంది సజీవదహనం అయ్యారు.

గుంతలోకి 3 వాహనాలు.. తల్లి, కొడుకు దుర్మరణం!

» ముందు వెళుతున్న ఆటోను ఢీకొట్టిన కారు

» అదుపుతప్పి ముందు వెళుతున్న బైక్‌ను ఢీకొన్న ఆటో

» 3 వాహనాలూ గుంతలోకి.. కారులోని తల్లి, కుమారుడి మృతి

శంషాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఒక వాహనం అదుపు తప్పడం.. ఆ వాహనంతో పాటు మరో రెండు వాహనాలను ప్రమాదం బారిన పడేసింది! మూడు వాహనాలూ రోడ్డు పక్కన ఓ గుంతలో పడ్డాయి. ప్రమాదానికి గురైనవి కారు, ఆటో, బైక్! ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న తల్లి, కొడుకు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందారు. ఆటోలో ప్రయాణిస్తున్న వారిలో ఒకరు, బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు గాయపడ్డారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ఘాంసిమియాగూడ వద్ద ఈ ప్రమాదం సంభవించింది. శంషాబాద్ రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. కొత్తూరు మునిసిపాలిటీ శ్రీరాంనగర్‌కు చెందిన బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ సైంటిఫిక్ ఆఫీసర్ మెరువ ఆదిశేషారెడ్డి(57), తల్లి రాములమ్మ(88)తో కలసి కారులో హైదరాబాద్ నుంచి నంద్యాలకు వెళుతున్నారు. ఘాంసిమియాగూడ వద్దకు రాగానే కారు అదుపుతప్పి ముందు వెళుతున్న ఆటోను ఢీకొట్టింది. ఫలితంగా ఆటో అదుపుతప్పి దాని ముందు వెళుతున్న బైక్‌ను ఢీకొంది. ఫలితంగా మూడు వాహనాలు ఒకదాని వెంట మరొకటి హైదరాబాద్-బెంగుళూరు జాతీయ రహదారి విస్తరణ పనుల కోసం నిర్మించిన కల్వర్టులో బోల్తాపడ్డాయి. ప్రమాదంలో కారులో ఉన్న ఆదిశేషారెడ్డి, రాములమ్మ అక్కడికక్కడే మృతిచెందారు. బైక్‌పై ఉన్న గొల్ల ఆంజనేయులు, వెనుక కూర్చున్న పద్నాలుగేళ్ల బాలిక, ఆటోడ్రైవర్ రాయన్నగూడ సిద్ధయ్య గాయపడ్డారు. ఆటోలో ఉన్న మరో ఇద్దరు రోడ్డుపక్కనే పడిపోగా వారికి ఎలాంటి గాయాలు కాలేదు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని తల్లీకుమారుల మృతదేహాలను కల్వర్టు నీటిలో నుంచి బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

పండుగ సరుకుల కోసం వచ్చి..

పరలోకాలకు!

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

చేర్యాల, జనవరి 13: సంక్రాంతి పండుగకు సరుకులు కొనేందుకు బయటికి వచ్చిన మహిళ రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. కాటర్‌పిల్లర్ మెషీన్ ఆపరేటర్ నిర్లక్ష్యంగా వాహనాన్ని నడపడంతోనే ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం దొమ్మాట గ్రామానికి చెందిన చల్లా లక్ష్మి(39) శనివారం చేర్యాలకు పండుగ కోసం సరుకులు కొనేందుకు వచ్చింది. తర్వాత ఇంటికి వెళ్లేందుకు చూస్తుండగా తమ ఇంటి సమీపంలోని బంధువు కనకారెడ్డి కలిసి టీవీఎస్ ఎక్సెల్‌పై దొమ్మాటకు వెళ్తూ ఎక్కించుకున్నాడు. ఇటు జనగామ-సిద్దిపేట ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో భాగంగా పట్టణ శివారులో కల్వర్టు నిర్మాణం జరుగుతోంది. అక్కడ చెవులకు ఇయర్ ఫోన్స్ పెట్టుకొని కాటర్ పిల్లర్ మెషీన్‌తో ఆపరేటర్ నిర్లక్ష్యంగా కంకర మిశ్రమాన్ని చదును చేస్తూ వెనక వైపునకు తోలుతున్నాడు. ఇంతలో వెనక నుంచి వస్తున్న కనకారెడ్డి బండి అదుపు తప్పడంతో ఇద్దరూ కిందపడిపోయారు. అది గమనించని ఆపరేటర్ మెషీన్‌ను లక్ష్మి పైనుంచి తీయడంతో ఆమె మృతి చెందింది. కనకారెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. కాగా, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని మృతురాలి కుటుంబీకులు, బంధువులు చేర్యాల పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. జనగామ-సిద్దిపేట రహదారిపై బైఠాయించారు.

పతంగి ఎగురవేస్తుండగా

విద్యుత్తు షాక్

» అత్తాపూర్‌లో 11 ఏళ్ల బాలుడి దుర్మరణం

» రైలు పట్టాలపై పడిన గాలి పటం

» నవాంద్గి స్టేషన్‌లో రైలు ఢీకొని బాలుడి మృతి

రాజేంద్రనగర్/బషీరాబాద్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): భవనంపై ఉన్న ఏసీ కాపర్ పైప్‌లైన్‌ను విద్యుత్ ప్రసారం జరిగి.. కరెంటు షాక్‌తో ఓ బాలుడు చనిపోయాడు. రాజేంద్రనగర్‌లో ఈ ఘోరం జరిగింది. అత్తాపూర్ రాంబాగ్ మల్లయ్య టవర్స్ సమీపంలో మహారాష్ట్రకు చెందిన అభిషేక్ కుటుంబం ఉంటోంది. అభిషేక్ సోదరుడు మూడేళ్ల క్రితం చనిపోయాడు. అభిషేక్ వదిన చాలారోజుల క్రితం ఎటో వెళ్లిపోయింది. దీంతో వారి కుమారుడు తనిష్క్(11) పెదనాన్న అభిషేక్ వద్దే ఉంటున్నాడు. సంక్రాంతి సందర్భంగా అభిషేక్ కుమారుడు మోహిత్ పతంగి ఎగురవేసేందుకు మల్లయ్య టవర్స్ ముందు ఉన్న లక్ష్మీవాణి టవర్స్ పైకి వెళ్లాడు. అతడితో తనిష్క్ కూడా వెళ్లాడు. లక్ష్మీవాణి అపార్ట్‌మెంట్స్ పెంట్‌హౌస్‌పై ఇద్దరూ పతంగి ఎగురవేస్తుండగా అక్కడ ఏసీ ఔట్‌పుట్ కాపర్ పైప్‌లైన్‌కు తనిష్క్ తగిలాడు. దానికి అప్పటికే విద్యుత్తు ప్రసారం జరగడంతో షాక్‌తో చనిపోయాడు. గాలిపటం కోసం పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని బాలుడు చనిపోయాడు. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం నవాంద్గి రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం ఈ ప్రమాదం జరిగింది. బషీరాబాద్ మైనారిటీ కాలనీకి చెందిన అస్లామ్ కుమారుడు అబుజార్(9) గాలిపటం ఎగరేస్తున్నాడు. అది తెగి ఇంటి సమీపంలోనే ఉన్న రైలు పట్టాలపై పడటంతో పతంగి తీసుకునేందుకు బాలుడు పరుగు తీశాడు. అప్పటికే స్టేషన్‌లో గూడ్స్ రైలు ఆగి ఉండటంతో దాని కింది నుంచి దూరి అటువైపు వెళ్తుండగా మరో ట్రాక్‌పై వస్తున్న రైలు ఢీకొట్టింది.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

మహిళలకు ధ్యానం ఎంతో అవసరం : మహబూబాబాద్ జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ సుంకరనేని నాగవాణి



బహుమతులు పొందిన మహిళలతో సుంకరనేని నాగవాణి

చిన్నగూడూరు (మహబూబాబాద్ జిల్లా), జనవరి 13: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని మహబూబాబాద్ జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ సుంకరనేని నాగవాణి అన్నారు. శనివారం చిన్నగూడూరు మండలంలోని జయ్యారం గ్రామంలో 'హార్ట్‌ఫుల్ నెస్ ఆధ్యాత్మిక ధ్యాన శిక్షణ సంస్థ' జయ్యారం ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో 200 మంది ఉత్సాహవంతమైన మహిళలు పాల్గొన్నారు. దీంతో జయ్యారంలో సంక్రాంతి సందడి వాతావరణం ఒకరోజు ముందే నెలకొంది. విజేతలతో పాటు ముగ్గుల పోటీలో పాల్గొన్న ప్రతీ ఒక్కరికి హార్ట్ ఫుల్‌నెస్ ధ్యాన శిక్షణ సంస్థ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సుంకరనేని నాగవాణి మాట్లాడుతూ.. పనిఒత్తిడితో కూడుకున్న నేటి మహిళలకు ధ్యానం ఎంతో అవసరమని అన్నారు. ధ్యానం చేయడం ద్వారా సమాజ అభివృద్ధి త్వరితగతిన జరుగుతుందని, హార్ట్ ఫుల్‌నెస్ సంస్థ నిస్వార్థంగా, శాస్త్రీయ పద్ధతిలో ఉచితంగా అందించే ధ్యానంను ప్రతీ ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు. ధ్యానంతో ధైర్యంగా త్వరితగతిన నిర్ణయాలు జరిగి, మహిళలు అన్నిరంగాల్లో ముందుంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పద్మ వెంకట్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ రాధ ముత్తయ్య, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు మురళీకృష్ణ, శిక్షకులు నరేందర్, వెంకటయ్య, విజయ, జనార్ధనాచారి, కేశవరావు, కవిత, జగన్నాథరెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

'చలో మేడారం' ఫోక్ సాంగ్ చిత్రీకరణ



షూటింగ్‌లో డ్యాన్స్ వేస్తున్న కళాకారులు

మేడారం, జనవరి 13: తాడ్వాయి మండలం మేడారంలో సమ్మక్క, సారలమ్మ ఫోక్ హంగామా ప్రొడక్షన్ ఆధ్వర్యంలో 'చలో మేడారం' సాంగ్ చిత్రీకరణను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్మాత డాక్టర్ కిన్నెర స్వాతి మాట్లాడుతూ.. వనదేవతలకు మొక్కులో భాగంగా ఈ చిత్రాన్ని మేడారంలో పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు సమక్షంలో తల్లుల ప్రధాన గేటు ముందు ఐల్యాండ్ వద్ద ప్రారంభించామన్నారు. సాంగ్ ప్రారంభంలో పూజారుల పరిచయం ఉంటుందని తెలిపారు. ఈ చిత్రం మూడు రోజులు మేడారంలో జంపన్నవాగు, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతాల్లో రూపొందించనున్నట్లు తెలిపారు. చిత్రం ద్వారా 900 మందికి ఉపాధి కల్పిస్తున్నామని, పూర్తి చేయడానికి రూ.22లక్షల ఖర్చు అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు జాన్ రఘు, సంగీత దర్శకుడు ఎస్కే బాజీ, సిబ్బంది, కళాకారులు, సినీ బృందం పాల్గొన్నారు.

వ్యవసాయ పంపు సెట్లకు జియో టాగింగ్ లేదు

నయీంనగర్, జనవరి 13: ఎన్‌పీడీసీఎల్ పరిధిలోని వ్యవసాయ పంపుసెట్లకు జియో ట్యాగింగ్ చేయడం లేదని టీఎస్‌ఎన్ పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి స్పష్టం చేశారు. హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్‌భవన్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో సీఎండీ వరుణ్‌రెడ్డి మాట్లాడారు. 2021వ సంవత్సరంలో డీటీఆర్ (డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్స్)లను 11 కేవీ ఫీడర్ లైన్ల మ్యాపింగ్ కోసం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. శుక్రవారం ఒక పత్రికలో 'వ్యవసాయానికి జియో ట్యాగింగ్ ' అని ప్రచురితమైన, వాట్సాప్‌లో వైరల్ అవుతున్న వార్త పూర్తిగా తప్పుడు వార్త అని, అవాస్తవమని సీఎండీ వరుణ్‌రెడ్డి తెలిపారు.

మొండ్రాయి యువకుడు జియో సైంటిస్ట్‌గా ఎంపిక



శ్రీకాంత్

సంగెం, జనవరి 13: మండలంలోని మొండ్రాయి గ్రామానికి చెందిన రైతు బిడ్డ సింగిరెడ్డి శ్రీకాంత్ జియో సైంటిస్టుగా(గెజిటెడ్ అధికారిగా) ఎంపికయ్యారు. శుక్రవారం వెలువడిన యూపీఎస్సీ (యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్) గ్రూపు-ఎ ఫలితాల్లో శ్రీకాంత్ 113వ ర్యాంక్ సాధించారు. ప్రిలిమరీ పరీక్ష(హాల్‌టికెట్ నంబరు 1090478) గత యేడాది ఫిబ్రవరి 18న, మెయిన్స్ జూన్ 25, 26 తేదీల్లో రాశారు. గత డిసెంబరు 5న ఢిల్లీలో ఇంటర్వ్యూకు హాజరయ్యారు. కాగా, ఈనెల 12న ఫలితాలు విడుదల కాగా, శ్రీకాంత్ 113వ ర్యాంకు సాధించారు. పదో తరగతి వరకు గ్రామంలో, ఇంటర్ నర్సంపేటలో పూర్తి చేశారు. డిగ్రీ హనుమకొండలో, ఎమ్మెస్సీ ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేశారు.

శ్రీకాంత్ జియో సైంటిస్టుగా ఎంపిక కావడంతో గ్రామంలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. శ్రీకాంత్ తండ్రి సింగిరెడ్డి కుమారస్వామి తనకున్న మూడెకరాల వ్యవసాయ భూమిలో పంటలు పండిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. తల్లి, తండ్రి అందించిన ప్రోత్సాహంతో చదువులో ముందంజలో నిలుస్తూ ప్రభుత్వ ఉద్యోగాల కోసం శ్రమించారు. తండ్రికి వ్యవసాయంలో సహకారం అందిస్తునే యూపీఎస్సీ పరీక్షలకు హాజరయ్యారు. కాగా, శ్రీకాంత్‌ను పలువురు అభినందించారు.

సమాచార హక్కు పరిరక్షణ సమితి కోఆర్డినేటర్‌గా మధు



హనుమకొండ రూరల్, జనవరి 13: జాతీయ సమాచార హక్కు పరిరక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా కో ఆర్డినేటర్‌గా హనుమకొండకు చెందిన సీనియర్ జర్నలిస్టు గాడిపల్లి మధును ఎంపిక చేశారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ కన్నెబోయిన ఉషారాణి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వహిస్తానని పేర్కొన్నారు.

వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

అన్నదానం చేసిన మాజీ ఎమ్మెల్యే గండ్ర



భక్తులకు అన్నదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి దంపతులు

భూపాలపల్లిటౌన్, జనవరి 13 : శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి దంపతులచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని మంజూర్‌నగర్‌లో గల ఈ ఆలయంలో వెంకటేశ్వరుడికి ప్రీతికరమైన శనివారం రోజు ప్రతీ వారం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు గండ్ర దంపతులు తెలిపారు. ఇందులో భాగంగానే అన్నదానం చేసినట్లు వారు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

చిట్యాల, జనవరి 13 : మండలంలోని జడల్‌పేట గ్రామంలో మిన్నాపురం మహేష్ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్రీడాకారులను పరిచయం చేసుకొని బ్యాటింగ్ చేసి టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు మిన్నాపురం రాగసుధ సంతోష్, మిన్నాపురం రమేష్, మేర్లు వెంకటేష్ సర్పంచ్ కామిడి రత్నాకర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ కాత్రేవుల సాయిలు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్న సీసీఎస్ పోలీసులు



సీసీఎస్ పోలీసులు పట్టుకున్న పీడీఎస్ బియ్యం

కృష్ణకాలనీ(భూపాలపల్లి), జనవరి 13 : భూపాలపల్లి మునిసిపాలిటీ పరిధిలో బాంబులగడ్డ-సీఆర్‌నగర్ ఏరియాలో నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని సీసీఎస్ పోలీసులు శనివారం రాత్రి పట్టుకున్నారు. తమకు అందిన పక్కా సమాచారం మేరకు సీసీఎస్ సీఐ వెంకట్, ఎస్సై శ్రావణ్‌కుమార్ నేతృత్వంలో ఆకస్మిక తనిఖీ చేయగా అట్టి బియ్యం పట్టుబడింది. వారు తెలిపిన వివరాల ప్రకారం.. సీఆర్‌నగర్‌కు చెందిన నడి రాకేష్ అనే వ్యక్తి ఇదే కాలనీలో ఓ ఇంటిని కిరాయికి తీసుకొని వివిధ ప్రాంతాల నుంచి పీడీఎస్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి భద్రపరిచాడు. అట్టి బియ్యాన్ని మహారాష్ట్రకు తరలించేందుకు భద్రపరిచాడన్నారు. కాగా, పట్టుబడిన బియ్యం సుమారు 100 క్వింటాళ్లు ఉండనున్నట్లు తెలిసింది. అట్టి బియ్యాన్ని స్వాధీనం చేసుకొని భూపాలపల్లి ఠాణాకు తరలించారు. పంచనామా చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ వెల్లడించారు.

క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

కాకతీయఖని, జనవరి 13 : ది కాకతీయఖని లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి నూతన క్యాలెండర్‌ను శనివారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆవిష్కరించారు. పట్టణంలోని లారీ అసోసియేషన్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు బాల్‌చంద్‌నాయక్ పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి వీలైనంత త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు రమేష్, రాకేష్, రాములు, రవి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ జీఎంకు వినతి



జీఎం శ్రీనివాసరావుకు వినతి పత్రాన్ని అందజేస్తున్న సింగరేణి రిటైర్డ్ కార్మికులు

కాకతీయఖని, జనవరి 13 : తమ సమస్యలను పరిష్కరించాలంటూ భూపాలపల్లి ఏరియా సింగరేణి జీఎం శ్రీనివాసరావుకు రిటైర్డ్ సింగరేణి కార్మికులు శనివారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సింగరేణి రిటైర్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ భూపాలపల్లి ఏరియా అధ్యక్షుడు గుండేటి సమ్మయ్య మాట్లాడుతూ సింగరేణి సంస్థలో అనేక సంవత్సరాలు సేవలందించి చాలీచాలని పింఛన్‌తో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామన్నారు. కుటుంబ పోషణ కష్టమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీ మూడు సంవత్సరాల కోసారి బేసిక్‌పై 50 శాతం పెంచాలని డిమాండ్ చేశారు. పదవీ విరమణ పొందిన కార్మికులకు తెల్లరేషన్ కార్డు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. 200 గజాల ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజిరెడ్డి, సమ్మిరెడ్డి, సాంబయ్య, రంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థ సమాజ అభివృద్ధికి గొడ్డలిపెట్టు

ములుగు కలెక్టరేట్, జనవరి 13 : బాలకార్మిక వ్యవస్థ సమాజ అభివృద్ధికి గొడ్డలి పెట్టు అని, బాలకార్మిక వ్యవస్థను ప్రోత్సహించడమంటే బాలల హక్కులను హరించడమేనని జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారి ఓంకార్ అన్నారు. ములుగు మండలంలోని మల్లంపల్లిలో శనివారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. బడి బయట ఉన్న బాలలను బాలకార్మికులుగా పరిగణించడం జరుగుతుందని, బాల్యం ఎంతో అమూల్యమైన దశ అని అన్నారు. బాల్యంలో పిల్లలంతా తమ హక్కులను స్వేచ్ఛగా అనుభవించేలా వారి హక్కులను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. బాలకార్మిక నిషేధ, క్రమబద్ధీకరణ చట్టం-2016 ప్రకారం 14 సంవత్సరాల లోపు పిల్లలను ఎవరైనా పనిలో పెట్టుకుంటే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ములుగు మండలంలో ఈ నెలలో ఆపరేషన్ స్మైల్ నిర్వహించడం జరుగుతుందని, అందులో భాగంగా 14 ఏళ్ల లోపు చిన్నారులు ఎలాంటి పనుల్లో ఉన్నట్లు గుర్తించినట్లయితే బాధ్యులపై కేసులు నమోదు అవుతాయని పేర్కొన్నారు. ఈ సదస్సులో ఎల్‌సీపీవో సంజీవ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఖమురున్నిష, గ్రామపంచాయతీ కార్యదర్శి పోలు రాజు, డీసీపీయూ కౌన్సిలర్ టి.సంధ్య, సీసీఐ కౌన్సిలర్ రాణి, పోలీస్ సిబ్బంది మమత, అంగన్‌వాడీలు, మెకానిక్‌లు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కంచెలపై అవగాహన సదస్సు

కన్నాయిగూడెం, జనవరి 13 : చట్టవిరుద్ధమైన చర్యలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని ఎస్సై ఎం.సురేష్ అన్నారు. శనివారం మండలంలోని తుపాకులగూడెంలోని పోలీస్‌స్టేషన్‌లో విద్యుత్ కంచెలపై రైతులకు, ప్రజా ప్రతినిధులకు ఎస్సై అవగాహన కల్పించారు. మండల పరిధిలోని అటవీ ప్రాంతంలో, గోదావరి పరివాహక ప్రాంతాల్లో రైతులు తమ పంటలను అటవీ జంతువుల నుంచి కాపాడుకునేందుకు విద్యుత్ కంచెలు(ఫెన్సింగ్) ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం అందిందని అన్నారు. విద్యుత్ వలయాల పక్క నుంచి వెళ్లే రైతులు, ప్రజలు, అటవీ జంతువులు, పశువులు ప్రాణాలు కోల్పోతున్నాయని, ఇటీవలే విద్యుత్ ఉద్యోగులు గాయాల పాలైన సంఘటన గుర్తు చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రజలు, ప్రజా ప్రతినిధులు పోలీసులకు సహకరించాలని కోరారు. సంక్రాంతి సందర్భంగా కోడిపందాలు, జూదాలు ,పేకాట,గంజాయి, గుడుంబా విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులను కోరారు. మిర్చి కల్లాల్లోకి ఇసుక అవసరం ఉన్న రైతులు తహసీల్దార్ కార్యాలయంలో అనుమతి పొందిన తర్వాతనే ఇసుకను తరలించాలని తెలిపారు.

వెదజల్లే పద్ధతిలో వరి సాగు

విత్తనాలు, నాటు ఖర్చు తగ్గుతుందంటున్న రైతాంగం **ఈ పద్ధతిలోనే సుమారు 70 శాతం సాగయ్యే అవకాశం**



మొలకెత్తిన వడ్లను పొలంలో చల్లుతున్న రైతులు



మొలకెత్తిన వడ్లు

కాటారం, జనవరి 13 : ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్ల ఓ వైపు.. వరి నాట్లు, ఇతర పనులకు ఖర్చు భారీగా పెరగడం మరో వైపు.. వీలైనంత మేర వరి సాగు ఖర్చులను తగ్గించుకోవాలని రైతులను ఆలోచింపజేస్తున్నాయి. పెట్టుబడుల కోసం అధికంగా డబ్బులు వెచ్చించి మద్దతు ధరలు కూడా అందని పరిస్థితిలో సరైన దిగుబడులు రాకుంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటామని రైతాంగం ప్రత్యామ్నాయం కోసం సిద్ధమవుతున్నారు. కాటారం మండలంలో గత ఏడాది యాసంగి సీజన్‌లో సుమారు 10వేల ఎకరాల్లో వరి సాగైంది. ప్రస్తుత సీజన్‌లో చెరువులు, బోరుబావులు, ఫిల్టర్ బోర్లు తదితర జల వనరుల ద్వారా వరి సాగు చేస్తున్నారు. ఈ యాసంగి సీజన్‌లో సుమారు 10,500 ఎకరాల్లో వరి సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. చాలా మంది రైతులు నారుమళ్లను ఏర్పాటు చేసి వరి నాట్లు వేసే పద్ధతికి స్వస్తి పలుకుతున్నారు.

మండలంలోని పలు గ్రామాల పరిధిలో రైతులు వారం రోజులుగా వడ్లు వెదజల్లే పద్ధతి(బ్రాడ్‌కాస్టింగ్ మెథడ్)ని అవలంబిస్తున్నారు. విత్తనాలను నీటిలో నానబెట్టి మండె కట్టి కొద్దిగా మొలకెత్తిన అనంతరం మొలకలను పొలంలో చల్లుతున్నారు. నాటు కోసం ఎకరాకు 25-30 కిలోల వడ్లు విత్తనాలుగా తెచ్చే రైతులు వెదజల్లే పద్ధతిలో కేవలం 10-12 కిలోలు మాత్రమే వినియోగిస్తున్నారు. నాటుకు ఎకరాకు రూ.5వేల నుంచి రూ.6వేల వరకు కూలీల ఖర్చు అయ్యే పరిస్థితి ఉండగా ప్రస్తుతం వెదజల్లే పద్ధతి రూ.500 రూ.1000తోనే అయిపోతుందని రైతులు వెల్లడిస్తున్నారు. దీంతో ఎకరాకు రూ.4వేల నుంచి రూ.5వేల వరకు నాటు, విత్తనాల ఖర్చు మిగిలే అవకాశం ఉండటంతో ఆ మేరకు దిగుబడులు పెరిగినట్లేనని చెబుతున్నారు. మండలంలో యాసంగి సీజన్ వరి సాగులో సుమారు 70శాతం వెదజల్లే పద్ధతితోనే అవుతుందని అంచనా. ఈ బ్రాడ్‌కాస్టింగ్ పద్ధతి విజయవంతం అయితే రైతులకు ఖర్చులు ఆదా అయ్యే పరిస్థితి ఉంది. వెదజల్లే పద్ధతితో పంట కాలవ్యవధి, కొంత పెట్టుబడి ఖర్చుపై ప్రభావం ఉంటుందని వ్యవసాయాధికారులు తెలిపారు. బ్రాడ్‌కాస్టింగ్ మెథడ్ వరి సాగుతో దిగుబడులు గతంలో ఉన్నట్లుగా, ఇంకా ఎక్కువగా ఉంటే రాబోయే రోజుల్లో నాట్లు వేసే పద్ధతి పూర్వపరమయ్యే అవకాశం ఉంది.

గుడుంబా నియంత్రణకు సహకరించాలి

వెంకటాపురం(నూగూరు), జనవరి 13 : గ్రామాల్లో గుడుంబా నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని స్థానిక ఎస్సై అశోక్ అన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని బెస్తగూడెం గ్రామంలో శనివారం ఆయన గ్రామస్థులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామంలో గుడుంబా తయారీ, విక్రయాల నియంత్రణకు యువత కృషి చేయాలన్నారు. అదేవిధంగా కోడిపందేలు, పేకాట ఆడుతున్న వారిపై పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామస్థులు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సివిల్, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

11 ఇసుక లారీలు సీజ్



సీజ్ చేసిన ఇసుక లారీలు

వాజేడు, జనవరి13: నిబంధనలకు విరుద్ధంగా అధిక లోడుతో వెళ్తున్న 11 ఇసుక లారీలను శనివారం స్థానిక పోలీసులు సీజ్ చేశారు. వాజేడు ఎస్సై సీహెచ్.వెంకటేశ్వర్‌రావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సాయంత్రం అరుణాచలపురం సమీపంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా వెంకటాపురం వైపు నుంచి వస్తున్న 11 ఇసుక లారీలను ఆపగా ఓవర్ లోడు గుర్తించారు. ఈ క్రమంలో నిబంధనలకు విరుద్ధంగా డీడీ ప్రకారం ఉండాల్సిన దానికంటే నాలుగు నుంచి ఐదు టన్నుల ఇసుకను అధికంగా తరలిస్తున్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. ఈ లారీలు వెంకటాపురం మండలంలోని మొర్రవానిగూడెం, ఒంటిచింతగూడెం ఇసుక ర్యాంపుల నుంచి వస్తున్నట్లు పేర్కొన్నారు. సీజ్ చేసిన లారీలను వాజేడు పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు వెల్లడించారు. చట్టప్రకారం కేసులు నమోదు చేసి దర్యాప్తును ప్రారంభించినట్లు ఆయన పేర్కొన్నారు.

ప్రమాదకరంగా నల్లగుంట-పాలంపేట రోడ్డు

ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

వెంకటాపూర్(రామప్ప), జనవరి 13 : మండలంలోని నల్లగుంట-పాలంపేట(నల్లకాలువ) రోడ్డు ప్రమాదకరంగా మారింది. వర్షాకాలంలో కురిసిన వర్షాలకు రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు పడడంతో అటుగా వెళ్లే వాహనదారులు, రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధితశాఖ అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కరెంటు ఉచ్చులు పెడితే కఠిన చర్యలు : సీఐ



రాయినిగూడెంలో గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ రంజిత్‌కుమార్

ములుగు కలెక్టరేట్, జనవరి 13 : అటవీ జంతువులను వేటాడేందుకు కరెంటు ఉచ్చులు పెట్టడం చట్టవిరుద్ధమని ములుగు సీఐ మేకల రంజిత్‌కుమార్ అన్నారు. అమాయకుల ప్రాణాలను హరిస్తున్న ఇటువంటి చర్యలను ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. ములుగు మండలం పెగడపల్లికి చెందిన రైతు మీనుగు సాంబయ్య ఇటీవల కరెంటు ఉచ్చుకు మృతి చెందగా అప్రమత్తమైన పోలీస్ శాఖ గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టింది. శనివారం మండలంలోని రాయినిగూడెంతో పాటు పలు గ్రామాల్లో సీఐ రంజిత్‌కుమార్, ఎస్సై వెంకటేశ్వర్‌లు సిబ్బందితో కలిసి గ్రామస్థులతో సమావేశాలు నిర్వహించారు. రాత్రివేళ పంట పొలాల చుట్టూ కరెంటు ఉచ్చులు పెట్టడం వల్ల రైతులు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే ఎవరైనా వదిలిపెట్టేది లేదని అన్నారు. అటవీ జంతువులను వేటాడే వారి వివరాలను తమకు తెలియపరిచి సహకరించాలని కోరారు.

కోడి పందాలు, పేకాట ఆడితే చర్యలు

సీఐ మండల రాజు, ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్

ఏటూరునాగారం : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని కోడి పందాలు, పేకాట ఆడితే వారిపై చర్యలు తప్పవని సీఐ మండల రాజు, ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్‌లు హెచ్చరించారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ కోడి పందాలు, పేకాట ఆడుతున్న వారి వివరాలు సేకరించి ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. కొంత మంది వ్యక్తులు రహస్యంగా రాత్రి వేళల్లో పేకాట ఆడుతూ తమ కుటుంబాలలో చిచ్చు పెడుతున్నారన్నారు. పండగ సందర్భంగా యువత, ఆయా ప్రైవేట్ వాహనాల డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలను కొని తెచుకోకూడదని సూచించారు. మద్యం తాగినట్లు తేలితే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ఏటూరునాగారంలో కొందరు వ్యక్తులు గ్రూపులుగా ఏర్పడి అడవులలో సంచరించే మూగజీవాలను విద్యుత్ తీగలు, ఉచ్చులు పెట్టి హత మారుస్తున్నారని, వారి పేర్లను సైతం సేకరించామన్నారు. ఇకనైనా జంతువులను హతమార్చి అక్రమంగా మాంసాన్ని విక్రయిస్తున్న వేటగాళ్లు తమ ప్రవర్తనను మార్చుకోవాలని సీఐ హెచ్చరించారు. లేనిపక్షంలో వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

తుడుందెబ్బ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

తాడ్వాయి, జనవరి 13 : మండల కేంద్రంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) జిల్లా నూతన కమిటీని శనివారం రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా బంగారి సాంబయ్య, ప్రధాన కార్యదర్శిగా వట్టం రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా సిద్దబోయిన నవీన్, కార్యదర్శిగా అల్లం రాకేష్, సాంస్కృతిక కార్యదర్శిగా కల్తి సురేష్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సాంబయ్య మాట్లాడుతూ ఆదివాసీల హక్కులు, చట్టాలు, సంస్కృతి, సంప్రదాయాలు, విద్య, ఉద్యోగ, ఉపాధి కోసం పోరాడుతానని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పదవి నాగేశ్వర్‌రావు, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు బొల్లి సారయ్య నాయకులు కిరణ్, రమేష్, శ్రీను, ప్రవీణ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న వ్యాలెట్ అప్పగింత

టేకుమట్ల, జనవరి 13: ఓ అమ్మాయి పోగొట్టుకున్న వ్యాలెట్‌ను ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఆ అమ్మాయి అడ్రస్ కనుకొని పోస్టు ద్వారా వ్యాలెట్‌ను పంపి నిజాయితీని చాటుకుంది మండలంలోని అంకుషాపూర్ గ్రామానికి చెందిన తోట అక్షర. వివరాల్లోకి వెళితే.. అంకుషాపూర్ గ్రామానికి చెందిన తోట అక్షర హైదరాబాద్‌లో చదువుకుంటుంది. సంక్రాతి సెలవులకు గాను శుక్రవారం ఇంటికి వస్తున్న క్రమంలో హైదరాబాద్‌లో ఓక్యాబ్‌లో వస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి వ్యాలెట్ మరిచిపోయింది. కాగా, అక్షర ఆ వ్యాలెట్‌లో ఏదైనా సమాచారం దొరుకుతుందేమోనని వెతకగా వివిధ రకాల కార్డులు ఉన్నప్పటికి ఫోన్ నెంబర్ దొరకలేదు. దీంతో అక్షర ఆమె అన్నయ్య వర్షిత్ సహాయంతో గుర్తింపు కార్డులపై ఉన్న తిరువురు శాంతముకుంద అనే పేరును సోషల్ మీడియాలో వెతకారు. కాగా, ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె ఐడెంటిఫై కావడంతో మాట్లాడి అడ్రస్ తీసుకొని శనివారం పోస్టు ద్వారా ఆమెకు వ్యాలెట్ పంపించారు. ఆ వ్యాలెట్‌లో రూ.3020 నగదు, క్రెడిట్ కార్డు, చెవి రింగులు, ఉండగా వాటిని పోస్టు ద్వారా ఆమెకి పంపారు. కాగా అడ్రస్ కనుక్కొని బాధితురాలికి వ్యాలెట్ పంపిన అక్షర, ఆమె అన్నయ్య వర్షిత్‌లను గ్రామస్థులు అభినందించారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న లారీ

సురక్షితంగా బయటపడ్డ దంపతులు

కృష్ణకాలనీ(భూపాలపల్లి), జనవరి 13 : భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో ద్విచక్ర వాహనాన్ని శనివారం లారీ ఢీకొంది. ఈ ఘటనలో పెనుప్రమాదం తప్పి సురక్షితంగా భార్యభర్తలు బయటపడ్డారు. స్థానికులు తెలిపిన ప్రకారం.. భూపాలపల్లి మునిసిపాలిటీ పరిధిలోని ఎల్‌బీనగర్‌కు చెందిన దేవేందర్ దంపతులు తమ ద్విచక్ర వాహనంపై జయశంకర్ విగ్రహం నుంచి అంబేద్కర్ సెంటర్ మీదుగా ఎల్‌బీనగర్‌కు బయలుదేరారు. ఈ క్రమంలో వెనకాలే వచ్చిన లారీ బైకను ఢీకొంది. దీంతో భార్యభర్తలు ఒక్కసారిగా కేకలు వేస్తూ వాహనంపై నుంచి పక్కకు దూకారు. దీంతో లారీ వారి ద్విచక్ర వాహనాన్ని ముందు భాగం టైరు ఎక్కించగా పూర్తిగా నుజ్జునుజ్జు అయింది. ఆవెంటనే గమనించిన పోలీసులు అక్కడకు చేరుకొని ద్విచక్ర వాహనాన్ని పక్కకు తీసి.. లారీని ఠాణాకు తరలించారు. కాగా, ఆ ఇద్దరు భార్యభర్తలతో పాటు ఘటనను చూసిన వారంతా ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు.

వైభవంగా రంగనాయకస్వామి కల్యాణం



ములుగులో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

ములుగు కలెక్టరేట్, జనవరి 13 : సంక్రాంతి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని ములుగు జిల్లాకేంద్రంలోని సీతారామాంజనేయస్వామి దేవాలయంలో శనివారం గోదాదేవి-రంగనాయకస్వామి కల్యాణం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు సముద్రాల శ్రీనివాసాచార్యులు, పొడిశెట్టి శేషాచార్యులు గోదాదేవి-రంగనాయకస్వామి కల్యాణ మహోత్సవాన్ని వేదమంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈసందర్భంగా అర్చకులు మాట్లాడుతూ ప్రతి ఏడాది గోదాదేవి-రంగనాయకస్వామి కల్యాణం జరపడం లోక కల్యాణంలో ఒక భాగమని, ప్రజలు సుఖసంతోషాలతో జీవించేందుకు ఈ కల్యాణాన్ని నిర్వహించడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గండ్రకోట కుమార్, సభ్యులు కొత్తపల్లి బాబూరావు, శంకేసి జగదీశ్, పల్లవి, ఓడెల రమేష్, సరళ, కాపిడి సంపత్, తోట రాధ, సూర కమల, జెల్ల కావేరి, ముత్తయ్య, విజయ, రంజిత్, ప్రభు, భక్తులు పాల్గొన్నారు.

● మంగపేట : మండలంలోని బోరునర్సాపురం సీతారామాంజనేయస్వామి దేవాలయంలో గోదాదేవి ఉత్సవమూర్తి విగ్రహానికి శనివారం 12 రకాల అభిషేకాలను ఆలయ ప్రధాన పూజారి జీడికంటి మధుసూదనాచారి శాస్త్రోపదేశంగా నిర్వహించి భక్తులకు దర్శనం గావించారు. ఉదయం 10 గంటలకు మహిళలతో సామూహిక కుంకుమ పూజలను నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తితో గ్రామంలో నగర సంకీర్తనను వైభవంగా నిర్వహించారు. గతనెల 15న ప్రారంభమైన గోదాదేవి ధనుర్మాస ఉత్సవాలను నెల రోజుల పాటు ఆలయ కమిటీ నిర్వహిస్తుంది. అందులో భాగంగానే శనివారం విరాట్ ఉత్సవం సందర్భంగా అర్చనలు, అభిషేకాలను నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, ప్రముఖులు పాల్గొన్నారు.

నేటి నుంచి వీరభద్రస్వామి ఆరాధన మహోత్సవాలు

దేవాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు



మహోత్సవానికి ముస్తాబైన వీరభద్రస్వామి దేవాలయం

ఏటూరునాగారం, జనవరి 13 : మండల కేంద్రంలోని ఆకుల వారిఘణపురం లో కొలువుదీరిన అభినవ వీర భ ద్ర స్వా మి దేవాలయంలో రెండు రోజుల పాటు ఆరాధన మహోత్సవ వేడుకలు ఘనంగా జరగనున్నాయి. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి విఘ్నేశ్వరుడి పూజ, పుణ్యహావచనం, నవగ్రహ పూజ కార్యక్రమాలు జరగనున్నట్లు ఆలయ చైర్మన్ బల్ల వీరభద్రయ్య తెలిపారు. 15వ తేదీన (సోమవారం) సాయంత్రం 4 గంటల నుంచి భద్రకాళి అమ్మవారికి కుంకుమార్చన, ఒడిబాల బియ్యం, స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు జరుగుతాయి. సాయంత్రం 6 నుంచి స్వామి వారిని పల్లకీలో పురవీధుల గుండా ఊరేగింపు జరుగుతుందన్నారు. దేవాలయం వద్ద మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారి తీర్థప్రసాదాలను స్వీకరించి స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు. అర్చకులు చౌడేశ్వర్, రాజు కుమార్, గాంగాధర్‌ల ఆధ్వర్యంలో పూజలు జరుగుతాయన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కృష్ణకాలనీ(భూపాలపల్లి), జనవరి 13: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన ఘటన మంజూర్‌నగర్‌లోని కుందూరుపల్లి సమీపంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గణపురం మండలం చెల్పూరుకు చెందిన చెల్లం రాజు సింగరేణి ఏరియా ఆసుపత్రిలో వంట మాస్టర్‌గా పని చేస్తున్నాడు. ప్రతీ రోజూ మాదిరిగానే శనివారం విధులకు వెళ్తుండగా కుందూరుపల్లి సమీపంలో వేగంగా వచ్చిన ఓ గుర్తు తెలియని కారు అతను ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో కిందపడిపోగా తలకు, చేతికి గాయాలయ్యాయి. ఆ వెంటనే గమనించిన స్థానికులు 108 సహాయంతో సింగరేణి ఆసుపత్రికి తరలించారు. కాగా, అతని పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు తెలిసింది.

లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

మంగపేట, జనవరి 13 : మండలంలోని మల్లూరు హేమాచల లక్ష్మీనర్సింహ స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. మేడారం సమ్మక్క-సారలమ్మ దేవతలను దర్శించుకొనుటకు ముందస్తు మొక్కులకు వెళ్లే భక్తులు ముందుగా లక్ష్మీనర్సింహ స్వామిని దర్శించుకొని వెళ్లడం ఆనవాయితి. అందులో భాగంగా స్వామి వారికి ఇష్టమైన శనివారం కావడంతో పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు భక్తులకు దైవ దర్శనాలు గావించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. సుమారు 12వేల మంది భక్తులు దైవ దర్శనాలు చేసుకున్నారని ఆలయ ఈవో సత్యనారాయణ, చైర్మన్ నూతలకంటి ముకుందం తెలిపారు. కాగా, మల్లూరులో ఈ నెల 15న హేమాచలుడి వరపూజ మహోత్సవం వైభవంగా జరుగుతుంది. ఈ మహోత్సవ వేడుక నిర్వహించే విశ్రాంతి మంటపాన్ని సుందరంగా ముస్తాబు చేశారు.

మహిళలకు చీరల పంపిణీ



మహిళలకు చీరలను అందజేస్తున్న సూర్య, సాంబశివరెడ్డి

మంగపేట, జనవరి 13 : మండలంలోని అకినేపల్లి-మల్లారంలో సంక్రాంతి పండుగ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 50 మంది మహిళలకు ఉచితంగా చీరలను శనివారం పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, మంత్రి సీతక్క కుమారుడు ధనసరి సూర్య హాజరై మహిళలకు చీరలను అందజేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే మహిళల సాధికారత సాధ్యమన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మొదటి వారంలోనే రాష్ట్ర వ్యాప్తంగా మహిళకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించిందని గుర్తు చేశారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా జాతీయ మిర్చి టాస్క్‌ఫోర్స్ డైరెక్టర్ నాసిరెడ్డి సాంబశివరెడ్డి, కాంగ్రెస్ నాయకుడు పి.నరేష్ మహిళలకు చీరలను బహూకరించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు రేగా కళ్యాణి, మండల అధ్యక్షురాలు శానం నిర్మల, నాయకులు నాగిరెడ్డి, బాలకృష్ణ, మొహినొద్దీన్, టి.సంజీవరెడ్డి, కె.శేషయ్య, ఎల్.వెంకన్న, వికాస్ అగ్రి ఫౌండేషన్ ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

చిట్యాల, జనవరి 13 : మండలంలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు నేరేళ్ల ఓదెలు డిమాండ్ చేశారు. చలివాగు, మానేరు ఆనుకొని ఉన్న గ్రామాల నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతుందన్నారు. పలువురు ఇసుక దందా చేసుకుంటూ సొమ్ము చేసుకుంటుంటే అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. వాగులలోని ఇసుకను తరలించడం వలన భూగర్భ జలాలు అడుగంటిపోయి రైతులకు సాగు, తాగు నీటికి ఇబ్బందులు పడవలసిన దుస్థితి రాకముందే అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో మాదిరిగా నిర్మాణాలకు అవసర నిమిత్తం అధికారుల నుంచి అనుమతి తీసుకొని ఇసుక తీసుకునే పద్ధతిని తిరిగి అమలులోకి తీసుకువచ్చి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని ఓదెలు డిమాండ్ చేశారు.

రహదారి పనులకు బ్రేక్

(5వ పేజీ తరువాయి)



మల్లంపల్లి ఎస్సారెస్పీ కెనాల్ సమీపంలో రోడ్డు పక్కనే భారీ పైపు

ఇప్పటి నుంచే తరలివస్తున్నారు. సెలవు రోజుల్లో మేడారంతో పాటు రామప్ప, లక్నవరం, మల్లూరుకు వెళ్లేందుకు పెద్ద సంఖ్యలో పర్యాటకులు వస్తున్నారు. రహదారిపై వాహనాల రద్దీ క్రమంగా పెరుగుతోంది. ఈ పరిస్థితుల్లో ప్రమాదాలు జరుగుతాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అటవీ, రెవెన్యూ మధ్య ఫైట్

ములుగు జిల్లాలో అటవీ, రెవెన్యూ శాఖల మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. గట్టమ్మ దేవాలయం సమీపంలో సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన విషయంలో తారాస్థాయికి చేరింది. వంద మందికి పైగా అటవీశాఖ సిబ్బంది వచ్చి పనులను అడ్డుకోగా సీఆర్‌పీసీ-145 కింద నోటీసులు ఇచ్చి పోలీసు బందోబస్తు మధ్య రెవెన్యూ అధికారులు పనులు కొనసాగించారు. ఓ దశలో రేంజర్ స్థాయి అధికారిపైనా కేసులు నమోదు చేసేందుకు రెవెన్యూ ముఖ్య అధికారులు ప్రయత్నించారు. ఏళ్లకాలంగా ఇరు శాఖల మధ్య సమన్వయ లోపం కొనసాగుతోంది. మారుమూల గ్రామాలకు రోడ్లు, ప్రభుత్వ భవనాలు, మిషన్ భగీరథ పైప్‌లైన్‌లు, కుంటలు, చెరువుల పునరుద్ధరణ, విద్యుత్ లైన్‌ల నిర్మాణాలలో అటవీశాఖ తరుచూ అభ్యంతరాలు చెబుతోంది. జిల్లాలోని అత్యధిక ప్రాంతం ఏజెన్సీ కావడం, అక్కడ అటవీ చట్టాలు అమలవుతుండటం కూడా ఇందుకు కారణంగా కనిపిస్తున్నాయి. ఇరు శాఖలు జాయింట్ సర్వేకు ముందుకు రాకపోవడంతో అనేక వివాదాలు కొనసాగుతుండగా మారుమూల గ్రామాల అభివృద్ధికి ఆటంకం ఏర్పడుతోంది.

మంత్రులు సీతక్క, సురేఖ స్పందించాలి..

అటవీశాఖ కొర్రీలతో ఏజెన్సీ పల్లెల్లో నిలిచిపోతున్న అభివృద్ధి పనుల విషయంపై ప్రస్తుత ములుగు ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి సీతక్క అనేక సందర్భాలలో అసెంబ్లీలో లేవనెత్తారు. కానీ, ఫలితం కానరాలేదు. మేడారం జాతర సమయంలో ఏటూరునాగారం నుంచి వచ్చే భక్తులను జాతరకు తరలించే క్రమంలో ప్రధానమైన కొండాయి రోడ్డు మార్గం కూడా అటవీశాఖ క్లియరెన్స్ లేక నిలిచిపోయింది. ఇటీవల మేడారం జాతర నిర్వహణపై హైదరాబాద్‌లో జరిగిన ఉన్నత స్థాయి సమీక్షలో సీతక్క అటవీశాఖ తీరును సున్నితంగా మందలించారు. ప్రజావసరాలకు సహకారమందించాలని కోరారు. సీతక్క ప్రాతినిధ్యం వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటం, ఉమ్మడి వరంగల్ జిల్లాకే చెందిన కొండా సురేఖ రాష్ట్ర అటవీశాఖ మంత్రిగా కొనసాగుతుండటంతో వివాదానికి పరిష్కారం లభిస్తుందని సర్వత్రా భావిస్తున్నారు. సత్వరమే జాతీయ రహదారి విస్తరణ పనులు మొదలు కాకుంటే రోడ్డు ప్రమాదాలు జరగడమే కాకుండా మేడారం జాతర సమయంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తే అవకాశాలు లేకపోలేదు.



గతేడాది మే 22న రహదారి విస్తరణ పనులను అటవీశాఖ అధికారులు అడ్డుకోగా జిల్లా కలెక్టర్ సూచనతో విచారణ జరుపుతున్న పోలీసులు (ఫైల్)